# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -ఎస్ఐఆర్ అమలును సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు.**

2. **తెలంగాణలోని కాజీపేట రైల్వే తయారీ కేంద్రం పనులు త్వరలో పూర్తికానున్నాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. .**

3. **పేదలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

4. **యువతకు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు.**

5. **ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.**

=========================

ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ -ఎస్ ఐ ఆర్ కార్యక్రమం అమలు తీరును సమీక్షించేందుకు భారత ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు.ఎన్నికల సంఘం కార్యదర్శులు సంతోష్ కుమార్ దూబె, నవీన్ కుమార్, కార్యదర్శి శీష్ రామ్ నిన్న విజయవాడ చేరుకున్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో వారికి కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం. నవీన్, రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు, స్వాగతం పలికారు. ఎన్నికల జాబితా నిర్వహణలో పారదర్శకత, ఖచ్చితత్వం, సమర్థవంతమైన విధానాల అమలుపై సంబంధిత అధికారులతో ఈరోజు విజయవాడలో సమావేశమై చర్చించనున్నారు.

-------------------------

తెలంగాణలోని కాజీపేట రైల్వే తయారీ కేంద్రం పనులు త్వరలో పూర్తికానున్నాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కాజీపేట రైల్వే యూనిట్ పురోగతిపై ఢిల్లీలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో కాజీపేట కేంద్రంలో ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని చెప్పారు.రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్‌లో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయనున్నట్లు వెల్లడించారు. కొత్త ఇంటర్‌సిటీ రైళ్లు ఆధునిక సౌకర్యాలతో రూపొందనున్నాయని ఈ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో

ప్రయాణించేలా రూపొందిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

ఆక్వా రంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. రొయ్యల మేత ధరల పెరుగుదల, ముడి పదార్థాల కొరత, ఎగుమతుల సవాళ్లపై మత్స్యశాఖ అధికారులతో దృశ్య మాధ్యమం విధానంలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రొయ్యల మేత ధరల పెంపు రైతులపై ప్రభావం చూపడంతో ఆక్వా పరిశ్రమ ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, పరిశ్రమ స్థిరంగా కొనసాగేందుకు మెరుగైన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

---------------------------

పేదలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మాతా–శిశు విభాగంలో అత్యాధునిక శస్త్రచికిత్సలు ప్రారంభమైయ్యాయని నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. 127 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ విభాగంలో 600 పడకలు, 10 ఆపరేషన్ థియేటర్లు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మహిళలు, గర్భిణీలు, నవజాత శిశువులు, చిన్నారులకు ఉచితంగా ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. గర్భిణీలకు అవసరమైన క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా ఇక్కడే నిర్వహించేలా చర్యలు ఏర్పాట్లు చేశామని చెప్పారు.

---------------------------

తెలంగాణలోని సింగరేణిలో బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరుల విలువ పెరగడంతో పాటు ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగం, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టును త్వరగా అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావాలని పేర్కొంటూ...

వాయిస్ 20 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ కు పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో యువతతో మంత్రి నిన్న సమావేశమయ్యారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృతిమ మేధ –ఏఐ, క్వాంటం సాంకేతికత, ఆటోమోటివ్, పునరుత్పాదక శక్తి రంగాల్లో పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి 23 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు వచ్చాయని, గూగుల్ వంటి సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని వెల్లడించారు. యువతకు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

---------------------------

గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజాహిత పరిపాలన అందిస్తూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం

అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నామని ఏలూరు  జిల్లాకు చెందిన లబ్ధిదారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా అందిన ఆర్థిక సహాయంతో సొంత ఇల్లు కట్టుకోగలిగామని ఏలూరుకు చెందిన లబ్దిదారు తెలిపారు.

వాయిస్ 10 సెకన్లు

అలాగే పీఎం కిసాన్ యోజన ద్వారా అందించే నగదు సహాయం పంటల  సాగుకు ఎంతో ఉ పయోగపడుతుందని లబ్ధిపొందిన రైతు రమేష్ పేర్కొన్నారు

వాయిస్ 11 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా  మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ రోజు సాయంత్రం వరకు పంపవచ్చు.

---------------------------

ఉత్తర జార్ఖండ్ నుండి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు  ఉత్తర–దక్షిణ ద్రోణి విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.  దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని  ఉత్తర కోస్తా, రాయలసీమ జిల్లాలలో రానున్న  మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఒకటి రెండు చోట్ల ఉరుములతో కూడిన వర్షాలు కూడా కురుస్తాయని పేర్కొంది. నిన్న రాష్ట్రంలోని  మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 45.2, ఏలూరు జిల్లా ధర్మాజిగూడెంలో 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. ఈ రోజు 79 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 152 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని పేర్కొంది.

తెలంగాణలోనూ రానున్న  మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. అలాగే రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో వడగాలులు వీచే అవకాశం ఉందని కూడా పేర్కొంది.

---------------------------

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో "ఫ్యూచర్ సిటీ" నిర్మాణం చేపడుతున్నామని తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ లోని ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించిన మంత్రులు, నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ  కార్యాలయ భవనం, యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం పనులను నిన్న  పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... ఫ్యూచర్ సిటీలో చేపట్టే ప్రతి నిర్మాణం,  అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తోందని తెలిపారు.

====================